డెంగ్యూతో చిన్నారి మృతి

రుషిత (ఫైల్)

హుజూరాబాద్, సెప్టెంబర్ 30 : డెంగ్యూతో పదేండ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో సోమవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన రావుల వెంకటేశ్వర్లు, రజని దంపతులకు కొడుకు, కూతరు రుషిత(10) ఉన్నారు. రుషితకు వారం రోజుల క్రితం జ్వరం రాగా స్థానిక వైద్యులకు చూపించారు. జ్వరం తగ్గకపోవడంతో రెండ్రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి డెంగ్యూ అని నిర్ధారించారు. వైద్యం చేస్తుండగానే రక్తకణాలు పూర్తిగా పడిపోవడంతో బాలిక మృతిచెందింది. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. రిషిత గ్రీన్ సెడ్జ్ (వీపీఎస్) స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నది.

స్కూల్ బస్సు ఢీకొని చిన్నారి దుర్మరణం

మనోజ్ఞ (ఫైల్)

ముస్తాబాద్, సెప్టెంబర్ 30 : స్కూల్లో ముందస్తు బతుకమ్మ వేడుకల కోసం కొత్త దుస్తులు ధరించి సంతోషంగా వెళ్లిన చిన్నారి అదే స్కూల్ బస్సు కిందపడి ప్రాణాలు విడిచింది. ఈ విషాదకర ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో సోమవారం జరిగింది. ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన భూమ రాజు – వెంకటలక్ష్మి దంపతులకు కూతు రు మనోజ్ఞ (5) ముస్తాబాద్‌లోని మహర్షి స్కూల్లో నర్సరీ చదువుతున్నది. సోమవారం బస్సులో స్కూల్‌కు వెళ్లింది. బస్సు దిగి వెనుక నుంచి వెళుతున్న క్రమంలో డ్రైవర్ చూడకుండా రివర్స్ తీయడంతో చిన్నారి వెనుక టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ, డీవైఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు.

సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, గంగుల, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు

కాంగ్రెస్‌కు మూసీ బ్యాంకు

- 2400 కి.మీ. 'నమామి గంగ'కు 40 వేల కోట్లు • 55 కిలోమీటర్ల మూసీకి 1.50 లక్షల కోట్లా? • మూసీ బాధితుల పాలిట కాలయముడిలా రేవంత్
- రెడ్‌లైన్లు వేసుడు కాదు.. డెడ్‌లైన్లు పెడుతం • ఢిల్లీ పార్టీలను గెలిపిస్తే గల్లీ ప్రజలకు ఆక్రందనలే • బుల్డోజర్‌కు అడ్డుగా నిలుస్తాం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ చెప్తున్న మూసీ సుందరీకరణ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వచ్చే సాధారణ ఎన్నికల కోసం ఈ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు రిజర్వ్ బ్యాంకులా, ఏటీఎంలా ఉపయోగపడుతుందని దుయ్యబట్టారు. మూసీ ప్రాజెక్టును ఎవరి కోసం చేపడుతున్నారో చెప్పాలని, అసలు కాంగ్రెస్ సర్కార్ ప్రాధాన్యాలు ఏమిటో చెప్పాలని నిలదీశారు. 300 రోజులైనా కాంగ్రెస్ హామీలు అమలు కావడంలేదని, ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రజలకు అక్కరకు రాని అంశంపై లక్షన్నరకోట్లు ఖర్చు పెట్టడం ఎవరికోసమని ప్రశ్నించారు. పేదల పక్షాన హైకోర్టుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'రెండు వేల పింఛన్ నాలుగు వేలవుతుందని, రెండు లక్షల రుణమాఫీ అని, తులం బంగారంతో కల్యాణలక్ష్మిని అమలు చేస్తామని, 10వేల నుంచి 15 వేలకు రైతుబంధు పెంచుతామని, ఆటో డ్రైవర్లకు నెలకు వెయ్యి, మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పారు.. వీటికి మాత్రం పైసల్లేవు, చేతులు రావు.. ఇవన్నీ ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వకుండా అక్కరకు రాని, అక్కరలేని, ప్రజలు కోరుకోని సుందరీకరణ కోసం, ఏ ప్రాధాన్యం లేకుండా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడుతామంటే ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇందులో ఏం ఆశించి చేస్తున్నారో చెప్పాలి' అని నిలదీశారు. ఓవైపు ఖజానాలో పైసల్లేవంటూనే అప్పుల కోసం అప్పులు తేవాల్సి వస్తున్నదని ఉప ముఖ్యమంత్రి చెప్తున్నాడని, ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. '25వేల కుటుంబాలు, లక్ష మందిని నిరాశ్రయులను చేసేందుకు మూసీ బాధితుల పాలిట ముఖ్యమంత్రి కాలయముడిలా మారాడు' అని మండిపడ్డారు. నేరం చేసిందెవరు? శిక్ష ఎవరికి వేస్తున్నారు? అని ప్రశ్నించారు. 1994లో కాంగ్రెస్ సర్కార్ ఉన్నప్పుడే పట్టాలిచ్చారని, రిజిస్ట్రేషన్లు అయ్యాయని, అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నామని, రిజిస్ట్రేషన్లు చేసుకున్నప్పుడు, నిర్మాణాలకు అనుమతులిచ్చినప్పుడు, ఇంటి పన్ను కట్టించుకున్నప్పుడు, కరెంటు కనెక్షన్ ఇచ్చినప్పుడు, మంచి నీళ్ల బిల్లు కట్టుమన్నప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని బాధితులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద సమాధానం ఉన్నదా? అని నిలదీశారు.

మొదట వారిపై చర్యలు తీసుకోండి

ప్రభుత్వానికి దమ్ముంటే, చేతనైతే వీటికి అనుమతినిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైకోర్టు కూడా ఇదే చెప్పిందని గుర్తుచేశారు. 'కూల్చాల్సి వస్తే మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్, ఆ తర్వాత జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం.. ఈ రెండూ నాలా మీద కట్టారు' అని తెలిపారు.

రాహుల్, ప్రియాంక ఎక్కడ?

మూసీ బాధితులు ఆక్రందనలు చేస్తుంటే కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎక్కడ? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు అశోక్‌నగర్‌లో చాయ్ తాగి, బిర్యానీ తిని ఓట్లు దండుకున్నారని దుయ్యబట్టారు. వారిప్పుడు ఏమయ్యారని నిలదీశారు. ఢిల్లీ పార్టీలను ఎప్పుడు గెలిపించినా గల్లీ ప్రజల ఆక్రందనలు ఇలానే ఉంటాయని ఉదహరించారు. 'మూసీ ప్రాజెక్టు వల్ల మురిసేది ఎంత మంది?, రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత?, మూసీ వల్ల ఒక్క ఎకరానికైనా సాగు నీరు వస్తుందా?, ఒక్క రైతుకైనా అదనంగా నీరందుతుందా? ఒక్క రిజర్వాయర్ అయినా వస్తుందా?.. ఏమీ లేకున్నా లక్షన్నర కోట్లు అంటే స్కాం కాదా' అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎం అన్నారని, మరీ మూసీ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు ఏటీఎం కాదా? అని నిలదీశారు. ఇది దేశంలోనే అతి పెద్ద కుంభకోణం కాదా? అని ప్రశ్నించారు.

వాటికే అంతయితే..

నమామి గంగే ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు, సబర్మతి రివర్ ఫ్రంట్‌కు రూ.7,050 కోట్లు, యమున రివర్ ప్రాజెక్టుకు రూ.1000 కోట్లు ఖర్చయితే మూసీకి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చట? అని కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. థేమ్స్ నది ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. 'ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్లు కట్టిస్తారని ఓట్లు వేశారు.. పేదల ఇండ్లు కూలగొడుతామని ముందే చెప్పి ఉంటే ఒక్కరంటే ఒక్కరు కూడా కాంగ్రెస్‌కు ఓటు వేస్తుండేనా?' అని ప్రశ్నించారు.

నీ జాగీరా

'అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న ప్రజల ఇండ్లను కూలగొడుతామంటే బీఆర్ఎస్ ఉరుకోదు.. వారికి అండగా నిలబడుతాం. బుల్డోజర్లు వస్తే వాటికి ఎదురుగా మేమే నిలబడుతాం' అని కేటీఆర్ ప్రకటించారు. సమావేశంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, బీఆర్ఎస్ నేతలు కార్తీక్‌రెడ్డి, తుల ఉమ పాల్గొన్నారు.

ఇల్లు అనేది ఎమోషన్

'పేద, మధ్య తరగతి వారికి జీవితకాలం చేసిన కష్టానికి ప్రతీరూపం ఇల్లు. ఇల్లు అనేది ఒక ఎమోషన్. ఆ కుటుంబం మొత్తం కలలుగనే ఒక సౌధం, అది నాలుగు ఇటుకలు, రెండు రాళ్లతో కట్టిన కట్టడం కాదు.. ఇల్లు అనేది జ్ఞాపకాల పొదరిల్లు' అని కేటీఆర్ గుర్తుచేశారు. 'ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామంటే ఎంత బాధ ఉంటదో రేవంత్‌రెడ్డికి తెలియక పోవచ్చు కానీ నాకు తెలుసు. కేసీఆర్ కుటుంబం ఒక్కసారి కాదు.. రెండు సార్లు డిస్‌ప్లేస్ అయింది. నానమ్మకు చెందిన పోసాన్‌పల్లి అప్పర్ మానేరు డ్యాంలో 1940లో మునిగిపోతే చింతమడకకు వచ్చాం. అమ్మమ్మ గ్రామం మిడ్ మానేరులో మునిగిపోయింది. మా జ్ఞాపకాలు, ఇండ్లు అన్నీ అక్కడే పోయాయి' అని గుర్తుచేసుకున్నారు. ఊరు, ఇంటిలో అల్లుకున్న జ్ఞాపకాలు, ఆశలు, ఆకాంక్షల విలువ రేవంత్‌రెడ్డికి తెలియకపోవచ్చు నన్నారు. కాంగ్రెస్ వాళ్లు సునీల్ కనుగోలు డైరెక్షన్‌లో 500 మందిని సోషల్ మీడియాలో పెట్టి బాధితులంతా ఆక్రమణదారులని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

కొనుక్కునే సంస్కృతి మీది..

ఐదు వేలు తీసుకొని మూసీ బాధితులు మాట్లాడుతున్నారంటూ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.50 కోట్లకు పీసీసీ ప్రెసిడెంట్ పదవి, రూ.500 కోట్లకు సీఎం పదవి అమ్ముకోవడం, మంత్రులు పర్సంటేజీలు పంచుకోవడం లాంటి కాంగ్రెస్ దిక్కుమాలిన అలవాట్లు ప్రజలకు ఉండవని ఎద్దేవా చేశారు. 'ఆత్మగౌరవం మీద కొడితే తెలంగాణ ప్రజలు తిరగబడుతరు.. వాళ్లు తిరగబడితే కాంగ్రెస్ వాళ్లు ఉళ్లలో తిరగలేని పరిస్థితి వస్తుంది' అంటూ హెచ్చరించారు. మంత్రి శ్రీధర్ బాబు మీద కొంత గౌరవం ఉండేదని, ఆయన మాటలతో గౌరవం పోయిందని చెప్పారు.

హనుమకొండ జిల్లా ఐనవోలులోని కేజీబీవీలో కరెంట్ పోవడంతో చీకటిగా మారిన గది

కలెక్టర్ సాక్షిగా 'కస్తూర్బా'లో కరెంట్ కట్

ఐనవోలు, సెప్టెంబర్ 30: హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం కలెక్టర్ ప్రావీణ్య ఉండగానే విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో కొన్ని క్లాసుల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కలెక్టరే స్వయంగా ఆదేశించిన 20 నిమిషాల తరువాత విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడం చర్చనీయాంశంగా మారింది.

3న ట్రిపుల్ ఆర్ బాధితుల మహాధర్నా

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 30 (నమస్తేతెలంగాణ) : ట్రిపుల్ ఆర్‌లో అలైన్‌మెంట్‌లో మార్పులు చేర్పులు, నష్టపరిహారం పెంపు తదితర డిమాండ్లతో ట్రిపుల్ ఆర్ బాధితులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ 3న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టనున్నారు. వ్యవసాయ భూములు, ఇండ్లు, ప్లాట్లు, వాణిజ్య భవనాలు, ఇతర ఆస్తులను కోల్పోతున్న బాధితులంతా రైతు ఐక్యవేదికగా ఏర్పడి ఆందోళనకు సన్నద్ధమవుతున్నారు. చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం, భువనగిరి తదితర మండలాల్లోని బాధితులతోపాటు గజ్వేల్, సంగారెడ్డి ప్రాంత నిర్వాసితులు కూడా తరలివచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మహాధర్నాకు సంబంధించి ఇప్పటికే పోలీసుల నుంచి అనుమతి కూడా పొందినట్టు తెలిసింది. ఈ ధర్నాకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీల రాష్ట్ర ముఖ్యనేతలతోపాటు రైతు సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నారు. సోమవారం విపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కీలక నేతలను కలిసి మహాధర్నాలో పాల్గొనాలని కోరారు. తమకు సంఘీభావంగా తరలివచ్చి అలైన్‌మెంట్లలో మార్పులు చేర్పు లు, పరిహారం విషయంలో మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. మహాధర్నాకు పెద్దసంఖ్యలో తరలివెళ్లి ధర్నాచౌక్ దద్దరిల్లేలా చేసి ప్రభుత్వం దిగివచ్చేలా చేయడమే తమ లక్ష్యమని రైతు ఐక్య వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు.

• తాగునీటి కోసం గిరిజనుల నిరసన

మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెంలోని పలు కాలనీలవాసులు సోమవారం నిరసన తెలిపారు. నీటి ట్యాంకు ఉన్నా.. పంపులు రాకపోవడంతో చేతి పంపులను ఆశ్రయించాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. – టేకులపల్లి

నేటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 30: డీఎస్సీ –2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నేటి నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గా ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని, 1.3 నిష్పత్తిలో వెరిఫికేషన్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. వెరిఫికేషన్ ఫామ్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

డిగ్రీ, పీజీ అడ్మిషన్ల దరఖాస్తు గడువు పొడిగింపు

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 30: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తు గడువును ఈ నెల 15 వరకు పొడిగించినట్లు గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్, సమన్వయకర్త రంజిత తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అపరాధ రుసుము లేకుండా www.braouonline.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఓపెన్ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 30: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరగనున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్ పరీక్షల సందర్భంగా కేంద్రాల వద్ద నిబంధనలు విధిస్తున్నట్లుగా సీపీ కల్మేశ్వర్ వెల్లడించారు. ఈ నెల 3 నుంచి 9 వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. మొదటి సెషన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండ్ సెషన్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్ర 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇద్దరి కన్నా ఎక్కువ మంది ఉండరాదని, వంద మీటర్ల పరిధిలో నిబంధనలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. జిరాక్స్ సెంటర్లు ఉదయం 7.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు బంద్ పాటించాలని సూచించారు.

గెలుపోటములు సహజం

కొండాపూర్ జట్టుకు బహుమతి అందజేస్తున్న అతిథులు

సిరికొండ, సెప్టెంబర్ 30: ఆటల్లో గెలుపోటములు సహజమేనని, ఓటమి చెందిన వారు నిరాశ పడొద్దని తహసీల్దార్ రవీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన 68వ అంతర్ పాఠశాలల క్రీడలు సోమవారం ముగిశాయి. విజేత జట్లకు బహుమతులను అందజేశారు. వాలీబాల్ విన్నర్‌గా కొండాపూర్ జట్టు నిలిచింది. కార్యక్రమంలో ఎంఈవో రాములు, ప్రతిభ స్కూల్ ప్రిన్సిపాల్ హరీశ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, సెప్టెంబర్ 30: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం ప్రాజెక్ట్‌లోకి 38,604 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు)కాగా,1091అడుగుల (80.501టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ ఆరుగేట్లు ఎత్తి 18,744 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. కాకతీయ కాలువకు 6800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, లక్ష్మీకాలువకు 150, మిషన్ భగీరథకు 231, వరదకాలువకు 10వేలు, సరస్వతీ కాలువకు 500 , గుప్తా ఎత్తిపోతలకు 270 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

కంఠేశ్వర్, సెప్టెంబర్ 30: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 62 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, అంకిత్ తో పాటు డీఆర్డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డికి అర్జీల ద్వారా సమర్పించారు. వినతులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

తిరుపతి లడ్డూ కల్తీపై సిటింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

వీహెచ్‌పీ ప్రతినిధుల డిమాండ్

అదనపు కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నేతలు

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 30: తిరుపతి లడ్డూ కల్తీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి తుమ్మలకృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ధర్నాచౌక్ వద్ద సోమవారం మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ఠాకూర్, మల్లారం పిట్ల కృష్ణ మహరాజ్, ఇస్కాన్ సిద్ధబలరాం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌గౌడ్, తదితరులు పాల్గొని మాట్లాడారు. దేవాలయాల్లో సనాతన బోర్డును ఏర్పాటు చేయాలని, అన్యాక్రాంతం అవుతున్న దేవాలయ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని, ఆలయాల్లో హిందువులకే ఉద్యోగాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆలయ ప్రాంగణాల్లో వ్యాపార సముదాయ దుకాణాలను హిందువులకే కేటాయించాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ అంకిత్‌కు వినతి పత్రం అందజేశారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్ , దాత్రిక రమేశ్, రామ్ ప్రసాద్ చటర్జీ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలి

జిల్లా కోర్టు ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న న్యాయవాదులు

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 30: రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసూ సోమవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్ రెడ్డి, వసంత్‌రావు, సురేశ్, పిల్లి శ్రీకాంత్, ఎర్రం గణపతి, భాస్కర్, శ్రీధర్, విశ్వక్ సేన్, ఆశ నారాయణ, భిక్షపతి, శివాజీ బోస్లే, సాయన్న, జైపాల్, మహిళా న్యాయవాదులు కవితారెడ్డి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

మాక్లూర్, సెప్టెంబర్30: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని దుర్గానగర్‌లో ఉన్న ఎస్టీ మినీ గురుకుల హాస్టల్, పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో వార్డెన్ దివ్యారాణితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నూతన భవనాలు, హాస్టల్‌కు కావాల్సిన వసతులు కల్పించడానికి కృషి చేస్తానని అన్నారు. చదువుతో పాటు క్రీడలు, డ్రాయింగ్ నేర్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, అధికారులు ఉన్నారు.

ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ట్రైనీ ఐఏఎస్


బాధ్యతలు స్వీకరిస్తున్న సంకేత్‌కుమార్

మాక్లూర్, సెప్టెంబర్ 30: స్థానిక ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ) ఎంపీడీవోగా ట్రైనీ ఐఏఎస్ సంకేత్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎంపీవో శ్రీనివాస్, తహసీల్దార్ శేఖర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెండు నెలల పాటు ఫుల్ అడిషనల్ చార్జ్‌తో ఎంపీడీవోగా బాధ్యతలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అధికారులు సకాలంలో విధులకు హాజరు కావాలని సూచించారు.

వరి కోతలు ప్రారంభం

సిరికొండ, సెప్టెంబర్ 30 : మండలంలోని కొండూర్ గ్రామంలో సోమవారం వరికోతలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొదటగా నాట్లు వేసి కోతలు కోయడంలో కొండూర్ ప్రథమ స్థానంలో నిలుస్తుంది. ఇక్కడి రైతులు అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా నిలుస్తున్నారు. కొండూర్ గ్రామంలో ధాన్యాన్ని వ్యాపారులు ముందుగా కొనుగోలు చేస్తారు. ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

గోదావరిలో గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 30: నిర్మల్ జిల్లా బాసర గోదావరిలో గత నెల 27న డిచ్‌పల్లి మండలం ధర్మారం (బీ) గ్రామానికి చెందిన కర్రోళ్ల జయ గల్లంతవగా.. ఆమె మృతదేహం సోమవారం లభ్యమైనట్లు గ్రామస్తులు తెలిపారు. కర్రోల్ల జయ, ఆమె తమ్ముడు కోటగిరి రవి, అతడి భార్య కృష్ణవేణి కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 27న బాసర క్షేత్రానికి వెళ్లారు. గోదావరిలో స్నానాలు చేస్తుండగా నీటి ప్రవాహానికి జయ కొట్టుకుపోయింది. ఆమె ఆచూకీ కోసం గాలించగా.. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం వాస్తవపూర్ గ్రామం వద్ద మృతదేహం లభించింది. జయ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రూ. లక్ష విలువ చేసే చైనా మాంజా సీజ్

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 30: నగరంలోని పెద్దబజార్ ప్రాంతంలో ఉన్న ఎన్‌కే కైట్‌షాపు (పతంగుల దుకాణం) పై సోమవారం టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసి రూ.లక్షా తొమ్మిది వేల విలువైన చైనా మాంజాను గుర్తించి సీజ్ చేసింది. దీంతోపాటు మాంజా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను సైతం అదుపులోకి తీసుకుని సంబంధిత రెండో టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్సై యాసిర్ ఆరాఫత్ వెల్లడించారు. నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాత కలెక్టరేట్ గ్రౌండ్ పరిశీలన

కంఠేశ్వర్,సెప్టెంబర్ 30: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌ను తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీతో కలిసి సోమవారం పరిశీలించారు. త్వరలో సీఎం చేతుల మీదుగా ఎనిమిది ట్రాక్‌లతో స్టేడియం ఏర్పాటుతో పాటు ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులతో కలిసి గ్రౌండ్ స్థితిగతులను ఆయన తెలుసుకున్నారు.

ఎస్సీ బాలుర వసతిగృహం ఉద్యోగిపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 30: బోధన్ పట్టణం ఎస్సీ బాలుర వసతిగృహంలో విధులు నిర్వహిస్తున్న సాయిలుపై చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం ఓ విద్యార్థి సంఘ నాయకుడు బేగరి సాయిలు సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు ఉద్యోగి రాత్రి సమయాల్లో మద్యం తాగి విధుల్లో నిర్లక్ష్యం వహించడమే కాకుండా, ప్రశ్నించిన తనపై కూడా దాడికి పాల్పడినట్లు వెల్లడించాడు. అదే విధంగా రాత్రి సమయాల్లో వసతిగృహంలోని విద్యార్థులను అసభ్యపద జాలంలో దూషిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయాల్లో సమగ్ర విచారణ చేపట్టి సదరు ఉద్యోగిపై చర్యలు చేపట్టేందుకు సబ్ కలెక్టర్‌కు నివేదించినట్లు బేగరి సాయిలు తెలిపారు.

కూతురుతో కలిసి తల్లి ఆత్మహత్యా యత్నం

కాపాడిన వీఆర్ఏ కరుణాకర్

తల్లి, కూతురును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు, ఎడపల్లి వీఆర్ఏ కరుణాకర్

ఎడపల్లి, సెప్టెంబర్ 30: ఓ తల్లి తన ఐదేండ్ల కూతురుతో కలిసి జాన్కంపేట్ అశోక్ సాగర్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించగా.. ఎడపల్లి వీఆర్ఏ కరుణాకర్ వారిని కాపాడారు. స్థానికుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గాజుల పేట్‌కు చెందిన సోమిడి మంజుల, రవికుమార్ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. మంజుల మానసికస్థితి బాగోలేకపోవడంతో ఏడాది నుంచి జాన్కంపేట్‌లో తల్లి అమ్మక్క వద్ద నివాసం ఉంటోంది. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉంది. దీంతో మంజుల తన చిన్న కూతురు కలిసి సోమవారంఅశోక్‌సాగర్‌లో ఆత్మహత్యకు యత్నించింది. అదే సమయంలో పొలానికి వెళ్లి వస్తున్న ఎడపల్లిలో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న జాన్కంపేట్‌కు చెందిన కరుణాకర్ గమనించి అడ్డుకున్నాడు. ఎడపల్లి పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి తల్లీకూతుళ్లను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వీఆర్ఏను పోలీసులు, గ్రామస్తులు అభినందించారు.